సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 28 । నవంబర్ । 2023



ఓటుహక్కు వినియోగం

మంథని: మంథని రెవెన్యూ డివిజనల్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్ సోమవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటుహక్కు వినియోగించుకున్నారు.



మల్లన్న సన్నిధిలో వేడుకలు

ఓదెల: మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయం విద్యుత్తుదీపాలతో దేదీప్యమానంగా వెలుగొందింది.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0/26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొడి వాతావరణం ఏర్పడుతుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా నృసింహుని కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

పెద్దపల్లిరూరల్: దేవునిపల్లి శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం సోమవారం కన్నులపండువగా జరిగింది. ఆలయ ఆవరణలో జరిగిన స్వామివారి కల్యాణోత్సవానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తజనం భారీగా తరలివచ్చింది. ఈవో శంకరయ్య, ఆలయ కమిటీ చైర్మన్ కొమురయ్య, సర్పంచ్ రాయిశెట్టి కిషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 2న స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు.

కాశీవిశ్వేశరాలయంలో రద్దీ



లింగార్చన పూజలలో భక్తులు

రామగుండం: ఆబాది రామగుండంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయానికి సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. కార్తీక మాసం సందర్భంగా వేకువజాము నుంచే లింగాభిషేకం చేసుకునేందుకు బారులు తీరారు. పూజారులు బుగ్గ శ్రీనివాస్ శర్మ, కల్వచర్ల రాజన్న అభిషేక పూజలు చేయించారు. కాగజ్‌నగర్, మంచిర్యాల, ఒడిశా, మహారాష్ట్రతో పాటుపొరుగు జిల్లాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. 'కోటి శైవక్షేత్రాల ఫలం – బ్రహ్మసూత్ర దర్శనం' శీర్షికన ఈనెల 17న 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో భక్తులు బారులు తీరుతున్నారని పూజారి బుగ్గ శ్రీనివాస్‌శర్మ తెలిపారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు



కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

మంథని: ఏసుక్రీస్తు కన్యగర్భంలో జన్మించడం ద్వారానే లోకానికి రక్షణ, పాప క్షపాపణ దొరికిందని పాస్టర్ల అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు వల్లూరి ప్రభాకర్ అన్నారు. స్థానిక సియోను ప్రార్థన మందిరంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ ఉత్సవాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాపులను క్షమించడానికే మానవ అవతారిగా ఏసుక్రీస్తు జన్మించారన్నారు. సంఘం కార్యదర్శి కాంపల్లి దాస్, సహాయ కార్యదర్శి సాత్విక్, సియోను సంఘాల పాస్టర్లు మంథని మార్క్, పెండ్లి ప్రసన్నకుమార్, కలువల సామ్యూల్, దాయారాజ్ ఉన్నారు.

నేటినుంచి 144 సెక్షన్ అమలు

గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈనెల 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి సోమవారం తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువమంది గుంపులుగా తిరగొద్దన్నారు. రాజకీయ పార్టీల జెండాలు, గుర్తులు, ప్లకార్డులు ధరించవద్దన్నారు. మైకులు, లౌడ్ స్పీకర్లు వాడవద్దని, రాజకీయ పార్టీల పాటలు, ఉపన్యాసాలు ఇవ్వకూడదన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటి కార్యక్రమాలను నేరంగా పరిగణించి అలాంటి వారిపై చట్టపరమైన చర్యలుతీసుకుంటామన్నారు.

30న సింగరేణికి సెలవు

గోదావరిఖని: ఎన్నికల సందర్భంగా ఈనెల 30న వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించినట్లు యాజమాన్యం ఒకప్రకటనలో తెలిపింది. లీవ్‌విత్‌పే, లీవ్‌విత్ అవుట్‌పే, సిక్ లీవ్‌విత్‌పే, సిక్ లీవ్ విత్‌ఔట్‌పే మంజూరు చేసుకున్న వారికి సెలవు వర్తిందని వెల్లడించింది. ఈనెల 29న, వచ్చేనెల 1న విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులకు సెలవు వర్తించదన్నారు. ఈనెల 30న విధులు నిర్వహించే అత్యవసర సిబ్బందికి ప్లేడే మస్టర్ చెల్లించనున్నట్లు పేర్కొంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

పెద్దపల్లిరూరల్: ఈనెల 30న పెద్దపల్లి అసెంబ్లీ స్థానానికి జరిగే పోలింగ్‌కు అన్నిఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుమోహన్ అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రచార గడువు ముగిసిన తర్వాత స్థానికేతరులు నియోజకవర్గం విడిచి వెళ్లిపోవాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సైలెన్స్ పీరియడ్ కాలంలో మద్యం దుకాణాలను మూసిఉంచాలన్నారు. 29న పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సిబ్బంది సామగ్రి తీసుకుని కేంద్రాలకు వెళతారన్నారు.

కమలదళంలో జోష్!

- కరీంనగర్‌ను సిల్వర్‌సిటీగా మారుస్తా
- కేంద్ర పథకాలు, నిధులను కేసీఆర్ అడ్డుకున్నారన్న ప్రధాని
- కబ్జాదారులా... మీకోసం కొట్లాడే సంజయ్ కావాలా?
- కరీంనగర్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



సభకు హాజరైన ప్రజలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్‌టౌన్: కరీంనగర్ కాషాయ దళంలో జోష్ నెలకొంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఎస్సారార్ కళాశాల మైదానంలో బీజేపీ నిర్వహించిన సకల జనుల విజయసంకల్ప సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకావడం పార్టీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహాన్ని నింపింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు కార్యకర్తలు, ప్రజలు సుమారు 30 వేల మంది పాల్గొన్నారు. మోదీ మట్లాడుతున్నంతసేపు జయధ్వానాలు పలికారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. బీజేపీ కేంద్ర ప్రభుత్వం మొత్తం తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం మోదీ సర్కార్ నిధులు ఇచ్చినా.. కేసీఆర్ సర్కార్ అడ్డుకుందని, కేసీఆర్ కరీంనగర్‌ను లండన్ చేస్తానని తప్పుడు వాగ్దానం చేశారని పేర్కొన్నారు. బీజేపీతోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 'కేసీఆర్ సాగునీటి పేరుతో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు. కాళేశ్వరం అవినీతి గురించి తెలంగాణనే కాదు.. యావత్ దేశానికి తెలుసు. అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్‌కు తగిన శిక్ష పడాలా.. వద్దా..?' అని ప్రశ్నించారు. 'కేసీఆర్ సర్కార్ చిన్న, సన్నకారు రైతుల ఉసురుపోసుకుంది.. మోదీ సర్కార్ పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి సాయం చేసింది. ఉప్పుడు బియ్యం కొనుగోలు చేసింది. ఫిలిగ్రీ కళకు కరీంనగర్ ప్రసిద్ధి చెందింది. మన్ కీ బాత్‌లో కూడా ప్రస్తావించాను. స్వర్ణకారులు, కళాకారుల కోసం పీఎం విశ్వకర్మ యోజన ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఇక్కడి ఫిలిగ్రీ కళాకారులకు ఆధునిక ట్రైనింగ్, లక్షల రూపాయల రుణం లభిస్తుంది. కరీంనగర్‌ను సిల్వర్ సిటీగా తీర్చిదిద్దేందుకు బీజేపీ కృషి చేస్తుంది..' అన్నారు. తను వోకల్ ఫర్ లోకల్ అనేది.. కరీంనగర్ బాగు కోసమేనని స్పష్టం చేశారు.

ఎవరు కావాలో తేల్చుకోండి: బండి సంజయ్

'పేదల కోసం కష్టపడి పనిచేసిన నాలాంటోళ్లను గెలిపించకపోతే.. పేదల కోసం ఎందుకు కొట్లాడాలని నా కార్యకర్తలు ప్రశ్నిస్తే నేనేం సమాధానం చెప్పాలే..? నా భార్యాపిల్లలను చంపుతామన్న భయపడకుండా ధర్మం కోసం, ప్రజల కోసం ఇన్నాళ్లు పోరాడిన. నాకు ఓట్లేసి గెలిపించకుంటే నా భార్యాపిల్లలు ప్రశ్నిస్తే ఏమని చెప్పాలి. కరీంనగర్ ప్రజలారా ఒక్కసారి ఆలోచించండి. రాష్ట్రంలోని అన్ని వర్గాలు మీ తీర్పు కోసం ఎదురు చూస్తున్నయ్. ఒక్క చాన్స్ ఇస్తే ఐదేళ్లు మీకు సేవ చేసుకుంటా. కరీంనగర్‌కు రక్షణ కవచంగా నిలుస్తా'.. అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ కోరారు. 'నమ్మిన సిద్ధాంతం కోసం, కమల వికాసం కోసం ఇదే కరీంనగర్‌లో బీజేపీ కార్యక్రమాల పోస్టర్లను గోడలకు అంటించిన. జాతీయ, రాష్ట్ర నాయకులొస్తే స్వాగతం పలకడానికి, కార్యక్రమాలు నిర్వహించేందుకు కరీంనగర్‌లో పార్టీ జెండాలు కట్టిన సామాన్య కార్యకర్తను. మీరు పెంచి పోషించిన కార్యకర్త. ఆ రోజు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా గెలిపిస్తే, ఈనాడు మీ అందరి ఓట్లతో ఎంపీగా గెలిచిన వ్యక్తిని. నేను ఏనాడూ మా నాన్న పేరు చెప్పి రాజకీయాల్లోకి రాలేదు. నమ్మిన సిద్ధాంతం కోసం, సమాజాన్ని సంఘటితం చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి మీ ముందు నిలబడ్డా. చాలా మంది అంటుంటారు.. బండి సంజయ్ ఏం చేశారని. వాళ్లకు చెప్పండి.. 9 వేల కోట్ల నిధులు తీసుకొచ్చా. మీ అందరూ వ్యాక్సిన్ తీసుకున్నారు కదా.. ఎవరిచ్చారు? బియ్యం ఎవరిచ్చారు..? కరీంనగర్ అభివృద్ధికి రూ.9 వేల కోట్లు ఇచ్చిందెవరు? స్మార్ట్‌సిటీ నిధులు, గ్రామీణ సడక్ యోజన నిధులు, జాతీయ రహదారులిచ్చిందెవరు? ఈ దేశ అభివృద్ధికి నిధులిచ్చిందెవరు.. అలాంటి మహనీయుడికి నిలబడి చప్పట్లతో స్వాగతం పలకండి' అని సంజయ్ కోరడంతో అందరూ లేచి నిలబడి స్వాగతం పలికారు. తాను ఏనాడూ సంపాదన, కుటుంబం గురించి ఆలోచించలేదన్నారు. 'డబ్బు ఆశ ఉంటే నేను మీకోసం కొట్లాడి జైలుకు పోకపోయేవాడిని కాదు. నామీద ఆరోపణలు చేసిన నేతల్లారా.. నేను అవినీతికి పాల్పడ్డట్లు రుజువు చేస్తే తన ఆస్తి మొత్తం కరీంనగర్ అసెంబ్లీ ప్రజలకు రాసిస్తా.. ప్రమాణం చేసి చెబుతున్నా.. దమ్ముంటే డాక్యుమెంట్లు తీసుకురండి. డబ్బు సంపాదన ఉంటే బండి సంజయ్ రెండు సార్లు జైలుకు వెళ్లడు.. ఏ రోజు నా కు కష్టమొచ్చినా, ఇబ్బంది వచ్చినా నా వెనుక మోదీ ఆశీర్వాదం ఉంది. నా భుజం తట్టి ప్రోత్సహించారు. మీకోసం కొట్లాడితే 74 కేసులు పెట్టారు. మీకోసం ప్రాణత్యాగానికి వెనుకాడను. దయచేసి కరీంనగర్‌లో పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులను బేరీజు వేయండి. ఎవరు భూకబ్జాలకు పాల్పడుతున్నారు. ఎవరి కష్టార్జితంతో కరీంనగర్‌లో ఇట్లాంటి వాతావరణం చేశారో ఆలోచించండి..'



ప్రధాని మోదీకి జ్ఞాపిక అందిస్తున్న ఎంపీ సంజయ్

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన కేసీఆర్: బండి

'రాష్ట్రాన్ని కేసీఆర్ నాశనం చేసిండు. డబుల్ బెడ్రూం, ఉద్యోగాల పేరుతో అందరినీ మోసం చేశాడు. 6 లక్షల కోట్ల అప్పుల పాల్జేశారు. ఏ విధంగా మళ్లీ వాటిని పూడుస్తారు. కాంగ్రెస్ ఎట్లా అభివృద్ధి చేస్తుంది? ఎట్లా జీతాలు ఇస్తుంది? అందుకే బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అప్పులు తీరి సుస్థిర పాలనతో అభివృద్ధి చేయడం సాధ్యం. ఎమ్మార్పీఎస్ చిరకాల వాంఛ ఎస్సీ వర్గీకరణ. పేదల కష్టాలు తెలిసిన వ్యక్తిగా మోదీ వారి కల నెరవేర్చారు. కరీంనగర్‌లో పోటీ చేసే ఇద్దరు అభ్యర్థులు (కాంగ్రెస్, బీఆర్ఎస్) టోపీ పెట్టుకుని నమాజ్ చేసుకుంటారు. ఎన్నికల తరువాత మసీదు జాగాలను కబ్జా చేస్తారు. ఎన్నికల ముందు గుడికిపోయి దండం పెడతారు. ఎన్నికల యాల్క గుడి స్థలాలను మింగేస్తరు.. పేదల ఇండ్లను కూల్చివేస్తారు. కరీంనగర్ ప్రజలంతా ఏకం కండి.. రెండుసార్లు ఓడిపోయా.. ఒక్కసారి గెలిపించండి. 5 రోజులు కష్టపడితే.. 5 ఏండ్లు మీకు సేవ చేసుకుంటా. కరీంనగర్‌కు రక్షణ కవచంగా నిలుస్తా.. మోదీ దేవుడెట్లా అవుతాడంటున్నడు కేటీఆర్.. మరి నీ అయ్య దేవుడా? ఆర్టీసీ కార్మికులు చనిపోతే బయటకు రాని మూర్ఖుడు మీ అయ్య. విద్యార్థులు, నిరుద్యోగులు చనిపోతే బయటకు రాలే.. రైతులు వడ్లకుప్పలపై పడి చనిపోతే బయటకు రాలే.. ఉద్యోగులు గుండెపగిలి చనిపోతే మీ అయ్య బయటకు రాలే.. మహిళలపై అత్యాచారాలు జరిగితే బయటకు రాలే.. పేదల బాధలు తెలిసి ఎప్పటికప్పుడు స్పందిస్తున్న ప్రధాని మోదీ నిజంగా దేవుడే. ఆయన మనలను ఆశీర్వదించడానికి మన గడ్డ పైకి వచ్చారు' అని బండి అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులు బొడిగె శోభ, ఆరెపల్లి మోహన్, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, చెన్నమనేని వికాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జోష్ నింపిన అమిత్‌షా

- పెద్దపల్లిలో రోడ్‌షో



మాట్లాడుతున్న అమిత్ షా

సాక్షి, పెద్దపల్లి: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా జిల్లా కేంద్రంలో సోమవారం చేపట్టిన రోడ్ షోతో బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసిన గెలిచిన ఎమ్మెల్యేలు ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలోకి చేరారని, ఈసారి అలా చేయకుండా బీజేపీ అభ్యర్థి దుగ్యాల ప్రదీప్‌రావును గెలిపించాలని అమిత్‌షా కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచితంగా ఏడాదికి నాలుగు వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. న్నారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దుగ్యాల ప్రదీప్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, పార్టీ శ్రేణులు హాజరయ్యారు.

జెండా గద్దె వరకు..

కలెక్టర్ ప్రాంగణంలో హెలిక్యాపర్ ద్వారా చేరుకున్న అమిత్ షా.. కాన్వాయ్ ద్వారా కమాన్ చౌరస్తాకు వచ్చారు. అక్కడ బీజేపీ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. అమిత్ షా కోసం ఏర్పాటు చేసిన వాహనం కాకుండా, మీడియా వాహనం ఎక్కి జెండాగద్దె వరకు చేరుకున్నారు. ఈసందర్భంగా రోడ్డుపై ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బీజేపీ శ్రేణులు ఆయనపై పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. కళాబృందాలు పాటలు, నృత్యాలతో ఆకట్టుకున్నాయి. జైశ్రీరామ్, భారత్ మాతాకీ జై నినాదాలతో బీజేపీ శ్రేణులను అమిత్ షా ఉత్సాహపరిచారు.

పటిష్ట భద్రత

పెద్దపల్లిరూరల్: అమిత్‌షా రోడ్ షోకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర పారా మిలటరీ బలగాలతోపాటు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, ఏసీపీలు మహేశ్, శ్రీనివాసరావు తదితర అధికారుల పర్యవేక్షణ కొనసాగించారు. కమాన్ నుంచి జెండా వరకు గల భవంతులపై పోలీసులు పహారా కాశారు. జెండా కూడలి వద్ద భవనం పైనుంచి వీడియో చిత్రీకరించారు.

కాంగ్రెస్ కావాలా.. కరెంట్ కావాలా?

- కాంగ్రెస్ కొత్తపార్టీ కాదు.. చెత్తపార్టీ
- దాసరి మంచోడు.. గెలిపిస్తే మూడు కొత్త మండలాలు
- సుల్తానాబాద్ రోడ్డుషోలో మంత్రి కేటీఆర్



రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, పెద్దపల్లి: 'కాంగ్రెస్ కావాలా? కరెంట్ కావాలో? ప్రజలు ఆలోచించాలి. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే కరెంట్ అక్కడ ఉండదన్న విషయం గుర్తుంచుకోవాలి' అన్నారు మంత్రి కేటీఆర్. పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తానాబాద్ పట్టణంలో మంత్రి కేటీఆర్ సోమవారం రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణలో చాలామందికి మూడెకరాల్లోపే భూమి ఉన్నదని, 3 గంటల కరెంట్ సరిపోతుందని, 24 గంటలు ఎందుకని రేవంత్‌రెడ్డి అంటున్నారని గుర్తుచేశారు. రైతుబంధు రైతుకు ఇస్తే కౌలుదారుకు ఇవ్వమని, కౌలుదారుకు ఇస్తే రైతుకు ఇచ్చేది లేదని పీసీసీ చీఫ్ ప్రకటించారని తెలిపారు. కాంగ్రెస్ కొత్తదేమీ కాదని, చెత్తపార్టీ అని ఆయన విమర్శించారు.

దాసరి మంచోడు

'మీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బ్రహ్మాండంగా పనిచేసేవాడు. కమీషన్లు తినే ఎమ్మెల్యే కాదు, కక్కుర్తిపడే ఎమ్మెల్యే కాదు. పదిమందికి ఖర్చుపెట్టే ఎమ్మెల్యే కానీ పదిమందిని ఆగం చేసే ఎమ్మెల్యే కాదు. అందుకే మీ అందరిని అడుగుతున్న.. పెద్దపల్లిని జిల్లాగా, సుల్తానాబాద్‌ను మున్సిపాలిటీగా చేసిన దాసరి మనోహర్‌రెడ్డిని గెలిపించండి. దాసరిని భారీ మెజార్టీతో గెలిపిస్తే గర్రెపల్లి, కొలనూర్, పెద్దపల్లి రూరల్‌ను కొత్త మండలాలుగా ఏర్పాటు చేస్తాం. జీవో 59కింద దరఖాస్తు చేసుకున్నవారి సమస్యలు పరిష్కరిస్తాం. ఎలిగేడులో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తాం' అని కేటీఆర్ హామీ ఇచ్చారు.

గులాబీమయమైన సుల్తానాబాద్

సుల్తానాబాద్ పూసాల రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన కేటీఆర్ రోడ్డుషోకు భారీగా జనం హాజరవడంతో ఆ ప్రాంతం గులాబీమయంగా మారింది. బీఆర్ఎస్ పాటలకు కేటీఆర్ తన మెడలో ఉన్న కండువాను గాలిలో తిప్పి, రోడ్డు షోకు హాజరైన వారితో సైతం కండువాలు గాల్లో తిప్పితూ ఉత్సాహపరిచారు. ఈకార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీ వెంకటేశ్‌నేత, బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో సింగరేణి ఉద్యోగులు

- ఒక్కో ఏరియాకు 150మంది నియామకం
- నేడు జిల్లా అధికారులకు రిపోర్ట్



గోదావరిఖని: ఈనెల 30 నిర్వహిస్తున్న అసెంబ్లీ ఎన్నికలకు సింగరేణి యాజమాన్యం ఉద్యోగులను కేటాయించింది. రెవెన్యూ, ప్రభుత్వ ఉపాధ్యాయ, పోలీసు సిబ్బందితోపాటు సింగరేణి ఉద్యోగులు కూడా ఎన్నికల్లో సేవలు అందించనున్నారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న 9ఏరియాల్లో పనిచేస్తున్న క్లరికల్, సెక్యూరిటీ సిబ్బందిని ఆయా నియోజకవర్గాల్లో విధులు నిర్వహించేందుకు ఆదేశాలు జారీచేసింది. బెల్లంపల్లి, ఇల్లెందు ఏరియాలు మినహా మిగతా ఏరియాల్లో ఉద్యోగులను ఎన్నికల విధులకు కేటాయించింది. మంగళవారం జిల్లా కలెక్టర్లకు రిపోర్టు చేయనున్నట్లు సింగరేణి అధికారులు తెలిపారు. ఒక్కో ఏరియాకు 75మంది సెక్యూరిటీ, మరో 75మంది క్లరికల్ సిబ్బందిని కేటాయించారు. రాష్ట్రంలోని ఆరు ఉమ్మడి జిల్లాల్లో బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయి. ఈప్రాంతాల్లో ఎన్నికల విధుల కోసం ఎన్నికల కమిషన్ సిబ్బంది అవసరమని కోరింది. ఈమేరకు మంగళవారం నుంచి ఎన్నికల విధుల్లో జాయిన్ అయ్యేందుకు విధుల నుంచి రిలీవ్ అయ్యారు. 2017లో జరిగిన సింగరేణి గుర్తింపు ఎన్నికల కోసం యాజమాన్యం బ్యాలెట్ బ్యాక్సులు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, పోలింగ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతోపాటు 468మంది ప్రభుత్వ ఉద్యోగులను విధులకు తెప్పించుకుంది. ఈసారి ఎన్నికల కోసం సంస్థ కమ్యూనిటీహాళ్లు, ఆఫీసులు, స్కూళ్లను వినియోగించనుంది. ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతాన్ని మినహాయించి వేరే నియోజకవర్గాల్లో సెక్యూరిటీ, క్లరికల్ సిబ్బందిని ఎన్నికల అధికారులు వినియోగించనున్నట్లు సమాచారం.

హక్కులు హైజాక్ చేసేవారిని నిలదీయండి

- తెలుగు రాష్ట్రాల సామాజికవేత్త అరుణ గోగుల



మాట్లాడుతున్న అరుణ గోగుల

మంథని: రాజ్యాంగం కల్పించిన హక్కులను హైజాక్ చేస్తున్న వారిని ఈ ఎన్నికల్లో నిలదీయడం, ప్రజల్ని చైతన్యవంతం చేయడం తనబాధ్యత అని తెలుగు రాష్ట్రాల ప్రముఖ సామాజికవేత్త, రచయిత అరుణ గోగుల అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో అరుణ మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత దారుణ హత్యలకు మంథని కేరాఫ్‌గా మారిందని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు ఖండిస్తూ వందకుపైగా దళిత సంఘాలు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నాలు చేశాయని గుర్తుచేశారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ అభ్యర్థి అనుచరులు చేస్తున్న అక్రమాలపై ప్రజలు ఆలోచించాలని కోరారు. రాష్ట్రంలోనూ దారుణ పరిస్థితులు ఉన్నాయని, అయినా, సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఖండించకపోవడం బాధాకరమన్నారు. అమాయకులు పోలీసుల చేతిలో హింసకు గురయ్యారని ఆరోపించారు. మంథనిలో సామాన్యులు భయానికి గురయ్యే పరిస్థితులు ఉన్నాయని, పోలీసులు ఎవరికి రక్షణ కల్పిస్తున్నారని ప్రశ్నించారు. బహుజన వాదమని చెప్పుకునే పుట్ట మధు ఆ వర్గాలకు ఎంతవరకు న్యాయం చేశారని నిలదీశారు. ఎమ్మెల్యేగా శ్రీధర్‌బాబు గెలిచిన తర్వాత అన్యాయానికి గురైనవారికి న్యాయం చేయాలని కోరారు. ప్రజలు ఆలోచించి పనిచేసే వారికి ఓటు వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రకటనలకు అనుమతి తీసుకోండి

పెద్దపల్లిరూరల్: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈనెల 29, 30వ తేదీల్లో పత్రికల్లో ప్రకటనల కోసం ఎంసీఎంసీ అనుమతిని పొందాలని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మంగళవారం సాయంత్రం 5గంటలకు ప్రచారం ముగించాలన్నారు. ఆ తర్వాత సైలెన్స్ పీరియడ్‌ను అభ్యర్థులు పాటించాలన్నారు. ఈ సమయంలో ఫలితాలను ప్రభావితం చేసే వార్తలను మీడియాలో ప్రసారం చేయొద్దన్నారు. ఫలితాల వివరాలను వెల్లడించడం, ఇతర మాధ్యమాల ప్రజల్లోకి తీసుకెళ్లడంపై నిషేధం ఉందన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ



మాట్లాడుతున్న అరుణశ్రీ

గోదావరిఖని: నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ హెచ్చరించారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం 5గంటలకు ప్రచార సమయం ముగిస్తుందని, ఆ తర్వాత ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈనెల 29, 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సైలెన్స్ పీరియడ్‌గా కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు, తమ పోలింగ్ ఏజెంట్లు పార్టీ కండువాలు, కరపత్రాలు, దుస్తులు ధరించకూడదన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్స్, ర్యాంపు, భద్రతకు సంబంధించి పోలీస్, సీఆర్‌పీఎఫ్ బలగాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మద్యం, డబ్బు పంపిణీ, అసత్య ప్రచారం నిర్వహించవద్దన్నారు. సమావేశంలో ఏఆర్‌వో కుమారస్వామి, సహాయ వ్యయ పరిశీలకుడు అశోక్‌కుమార్, కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి తిరుపతి, మీడియా అండ్ కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజని పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ప్రచారం

- రామగుండం, పెద్దపల్లిలో సాయంత్రం 5గంటలు..
- మంథనిలో 4గంటలకే వరకే గడువు
- ఓటర్ల ప్రసన్నం కోసం అఖరి ప్రయత్నాలు
- బూత్‌ల వారీగా సమీక్షలు చేస్తున్న అభ్యర్థులు



సాక్షి, పెద్దపల్లి/మంథని: హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారానికి మరికొన్ని గంటల్లో తెరపడనుంది. ఈ నెల 30న పోలింగ్ నిర్వహిస్తారు. నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారం నిలిపివేయాల్సి ఉంటుంది. దీంతో ఈరోజు(మంగళవారం) సాయంత్రం 5 గంటల వరకే(మంథనిలో సాయంత్రం 4 గంటల వరకే) సమయం ఉండటంతో ఈకాస్త సమయాన్ని చాలా విలువైందిగా అభ్యర్థులు భావిస్తున్నారు. నిధుల కొరతను అధిగమిస్తూ వ్యాపారులు, ఇతర రంగాల వారి సాయం తీసుకొని ఖర్చులకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చివరి రోజు భారీ ర్యాలీలు, రోడ్డుషోలతో బలప్రదర్శన చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఇంటింటా ప్రచారానికి స్వస్తి

ఇప్పటిదాకా ఇంటింటా ప్రచారంపై దృష్టి పెట్టిన అభ్యర్థులు.. నేడు ఆయా మండల కేంద్రాల్లో పర్యటించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇంటింట ప్రచారం చేస్తే ఉన్న సమయం వృథా అవుతుందన్న కోణంలో ఆలోచిస్తున్నారు. అందుకే మండలాల్లో రోడ్‌షోలు, మండల ముఖ్యనాయకులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

లోటు పాట్లు సర్దుకునే యత్నం

ప్రచారంలో జరిగిన చిన్నలోటుపాట్లను సర్దుకునే దిశగా అభ్యర్థులు ఆలోచిస్తున్నారు. పార్టీలో ఉన్న అసంతృప్తులు చేజారిపోకుండా చూసుకునే బాధ్యతను నమ్మకమైన నాయకులకు అప్పగిస్తున్నారు. తాము ప్రచారానికి వెళ్లని గ్రామాల్లోని ముఖ్యమైన వ్యక్తులను ఫోన్‌లో పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. అవసరమైతే ఆ గ్రామాలను ఒకసారి చుట్టివచ్చేలా ప్లాన్ చేసుకుంటున్నారు. బూత్ కమిటీలతో సమీక్షలు, పోలింగ్ ఏజెంట్ల నియామకాల గురించి చర్చిస్తున్నారు. వీటన్నింటితోపాటు కీలకమైన సమయంలో ప్రచారం ఉత్సాహంగా ముగించే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

సోషల్ మీడియాపై నిఘా

ప్రచార గడువు ముగుస్తున్న తరుణంలో అభ్యర్థులు సోషల్ మీడియాపై దృష్టి పెడుతున్నారు. సాయత్రం 5 నుంచి 30వ తేదీన పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకూ ఫేస్‌బుక్, వాట్సాప్, ఎస్ఎంఎస్, వాయిస్ కాల్స్ ద్వారా ప్రచారాన్ని చేపట్టాలని భావిస్తున్నారు. ఆ దిశగా ఏర్పాట్లు చేసుకొని నిపుణులైన వారికి బాధ్యతలు అప్పగించారు. అయితే సోషల్ మీడియా ప్రచారంపై కూడా నిఘా తీవ్రతరం చేస్తామని ఎన్నికల సంఘం ప్రకటించడంతో తర్జనభర్జన పడుతున్నారు. అవసరమైతే కేసులు పెట్టడానికి కూడా ఈసీ సిద్ధంగా ఉండడంతో అయోమయంలో పడ్డారు. అయినప్పటికీ కొందరు అభ్యర్థులు తమ సహచరుల ద్వారా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారానికి తెరలేపనున్నారు.

నిజాలు, అబద్ధాలపై చర్చించాలి

- బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు

మంథని: అసత్యాలను నిజాలుగా చూపించే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ కుటిల రాజకీయాలను ప్రజలు గుర్తించి గుణపాఠం చేప్పాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు కోరారు. గుంజపడుగు, నాగారం, ఆరెంద గ్రామాల్లో సోమవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి.. పనికోసం వెళ్తే.. తమ ప్రభుత్వం లేదని మాట దాటేశారని ఆరోపించారు. కేవలం ఓట్లకోసం నోట్ల సంచులు తీసుకొచ్చి ప్రజలను మభ్యపెట్టడం అలవాటుగా మారిపోయిందని పేర్కొన్నారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ తుపాకులు పట్టుకుని అడవిబాట పట్టినోళ్లు.. వాటిని వదిలేసివచ్చి మళ్లీ అదే పార్టీలోకి వెళ్తున్నారని, వీళ్లంతా ఒక్కటై తనను అంతం చేయాలని కుట్రలు చేస్తున్నారని మధు ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా నెలరోజుల్లో గుంజపడుగును మండలంగా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆరెంద, మల్లారంలో ముంపునకు గురవుతున్న భూములను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. కాగా, మంథని మండలం భట్టుపల్లికి చెందిన 50మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

మధును గెలిపించండి

నియోజకవర్గ అభివృద్ధికి పుట్ట మధు తనసొంత ప్రణాళికలో యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చినందున ఈ ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని తెలంగాణ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థుల బృందం అధ్యక్షుడు చాదల్ లక్ష్మీనారాయణ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతినిధులు సురేశ్, ప్రశాంత్, ఆకాశ్, రాహుల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేసి గోసపడొద్దు

కాటారం: కాంగ్రెస్‌కు ఓటేసి గోస పడొద్దని భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి కోరారు. బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకు మద్దతుగా మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు జక్కు రాకేశ్, మండల అధ్యక్షుడు జనార్దన్, రామిళ్ల కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుట్ట మధుకర్

బీఆర్‌ఎస్‌లో చేరికలు

పలిమెల : లెంకలగడ్డ కాంగ్రెస్ ఉపసర్పంచ్ పడాల నాగయ్య, వార్డు మెంబర్ నానువల లక్ష్మి తదితరులు పుట్ట మధు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

గ్రామాల్లో ప్రచారం

మహాముత్తారం: యామన్‌పల్లి, ములుగుపల్లి, దుంపిల్లపల్లిలో బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రచారం చేశాయి. కారు గుర్తుకు ఓటు వేసి పుట్ట మధును గెలిపించాలని కోరారు. నాయకులు సోమ శాంతకుమార్, కల్వచర్ల రాజు, దూలం మల్లయ్య ఉన్నారు.

సింగరేణి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి చేశానని పుట్ట మధు అన్నారు. సింగరేణి ప్రభావిత వెంకట్రావుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారరు. ఈ కార్యక్రమంలో నాయకులు బూడిద సమ్మయ్య, కండెం సురేశ్, ముత్యాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే స్వర్ణయుగం సాధ్యం

- మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌బాబు

మల్హర్(మంథని): స్వర్ణయుగ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంథని ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. కొండపేట, ఇప్పలపల్లి, పెద్దతూండ్ల, తాడిచర్లలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు సబ్సిడీలు ఇస్తామన్నారు. రూ.2లక్షల రుణమాఫీ అములు చేస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలతో పేదలకు అండగా ఉంటామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

మెడికల్ కాలేజీ ఏర్పాటు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మంథని నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. అలాగే 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, జెడ్పీటీసీ అయిత కోమల, మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్ పాల్గొన్నారు.

సబ్బండ వర్గాలకు అండగా మేనిఫెస్టో

కాటారం: సబ్బండ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసేలా కాంగ్రెస్ మేనిఫెస్టో ఉందని కాంగ్రెస్ యూత్ నాయకుడు, మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. మండల కేంద్రం, గారెపల్లిలో శ్రీనుబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలోని అన్ని గ్యారంటీలను అమల్లోకి తీసుకొస్తామన్నారు. శ్రీధర్‌బాబుకు ఓటువేసి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, నాయకులు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, జాడి మహేశ్వరి, శ్రీనివాస్, కుంభం రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీధర్‌బాబు

ఆశీర్వదించండి

రామగిరి(మంథని): ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని, ఐదేళ్లు సేవకుడిగా పనిచేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు కోరారు. లద్నాపూర్, నాగెపల్లి, రత్నాపూర్, పన్నూర్, వెంకట్రావ్‌పల్లి, వకీల్‌పల్లి ప్లాట్లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకేశి రవీందర్, మ్యాదరబొయిన శారద, కాపురబొయిన శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

'సంక్షేమాన్ని విస్మరించిన కేసీఆర్'

సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ విమర్శించారు. ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీధర్‌బాబుకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి జనక్ ప్రసాద్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం శ్రీపాదభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు గణపతి, కాటం సత్యం, ఎంఆర్‌సీ రెడ్డి, డీటీ రావు, గంగాధర్, దామోదర్, వెంకటస్వామిగౌడ్, కుమార్ స్వామి, ఉడుత శంకర్, బండ కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి

కాంగ్రెస్‌ను ఆశీర్వదించి శ్రీధర్‌బాబును గెలిపించాలని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు కోరారు. సెంటనరీకాలనీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు ఉన్నారు.

యువకుడి హఠాన్మరణం

సుల్తానాబాద్‌రూరల్: నృత్యం చేస్తూనే కుప్పకూలి బీటెక్ విద్యార్థి కాముని శివతేజ(21) మృతిచెందాడు. కరీంనగర్‌లోని భాగ్యనగర్ కాలనీకి చెందిన కాముని రాజేశ్వర్–ప్రమీల దంపతులు. వీరికి ఓ కూతురు, కొడుకు శివతేజ ఉన్నారు. శివతేజ ఓ కళాశాలలో బీటెక్ చదవుతున్నాడు. తన అక్కకు ఈనెల 29న వివాహం నిశ్చయమైంది. ఆదివారం సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని ఓ రిసార్ట్‌లో విందు ఏర్పాటు చేశారు. విందుకు పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు, బంధువులు హాజరయ్యారు. అందరూ ఆనందంగా గడిపారు. ఈ క్రమంలో శివతేజ అక్క, కాబోయే బావతో కలిసి నృత్యం చేశారు. కాసేపటికే నృత్యం చేస్తున్న శివతేజ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. తన కళ్ల ముందే తమ్ముడు చనిపోవడంతో అక్కతో పాటు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. శివతేజ మృతితో రెండు కుటుంబాల్లోనూ విషాదం నెలకొంది.

గీత కార్మికుడి మృతి

పెద్దపల్లిరూరల్: రంగాపూర్ గ్రామానికి చెందిన దొమ్మటి రాజమౌళి(46) అనే గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి జారి పడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. కల్లు గీసేందుకు తాటి చెట్టుపైకి ఎక్కుతుండగా జారి కిందపడ్డ రాజమౌళికి ఫిట్స్ కూడా రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడని పేర్కొన్నారు. నిరుపేద అయిన రాజమౌళి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సర్పంచ్ గంట లావణ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గంట రమేశ్ కోరారు.

అందరూ ఓటు వేయాలి

ముత్తారం: ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలు, బెదిరింపులకు లొంగకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంథని సీఐ గడిగొప్పుల సతీష్ కోరారు. సోమవారం ఖమ్మంపల్లిలో పోలీస్ కవాతు నిర్వహించారు. ముత్తారం, రామగిరి, మంథని ఎస్సైలు మధుసూదన్‌రావు, కటికె రవిప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరి ఖని టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో రామగిరి మండలం సుందిళ్ల, జనగామ గ్రామాల్లో సోమవారం కవాతు నిర్వహించారు. ఇందులో పారా మిలటరీ బలగాలు పాల్గొన్నాయి. సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలన్నారు. ఎస్సై చంద్రశేఖ ర్, పోలీస్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంథనికి విజయశాంతి

మంథని: మంథనిలో మంగళవారం కాంగ్రెస్ విజయభేరి సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరిఖని రోడ్డు బస్ డిపో సమీపంలో నిర్వహించే సభకు కాంగ్రెస్ ప్లానింగ్, కో–ఆర్డినేషన్ చీఫ్ కో–ఆర్డినేటర్ విజయశాంతితో పాటు ఇతర పార్టీ ప్రముఖులు హాజరు కానున్నట్లు కాంగ్రెస్ మంథని అభ్యర్థి శ్రీధర్‌బాబు తెలిపారు.

అందుబాటులో ఉంటా.. ఆదరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

- కాంగ్రెస్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల(పెద్దపల్లి): ఒక్కసారి అవకాశం ఇస్తే గ్రామ సేవకుడిలా అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని విజయరమణారావు అన్నారు. ఓదెలలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను దోచుకుంటోందన్నారు. ధాన్యంలో కోత విధించకుండా, కల్లాల్లో మిల్లర్లకు అవకాశం ఇవ్వకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పెద్దపల్లిలో అభివృద్ధి జరగలేదని పదేళ్లలో పేదలకు ఒరిగిందేమిలేదని విమర్శించారు. చేతిగుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు మూల ప్రేంసాగర్‌రెడ్డి, గోపు నారాయణరెడ్డి, బైరి రవిగౌడ్, గుండేటి ఐలయ్యయాదవ్, బొడకుంట లక్ష్మి, చిన్నస్వామి, చీకట్ల మొండయ్య, బొడకుంట శంకర్, తీర్థాల వీరన్న, సది, నరేశ్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైష్ణవి

నాన్నను గెలిపిస్తే అభివృద్ధి

ఎలిగేడు(పెద్దపల్లి): తమ నాన్న విజయరమణారావును ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూతురు చింతకుంట వైష్ణవి అన్నారు. నారాయణపల్లిలో సింగిల్ విండో మాజీ చైర్మన్ నరహరి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైష్ణవి ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు సామ రాజేశ్వర్‌రెడ్డి, భూర్ల సింధూజ, రాజిరెడ్డి, మోహిన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదరిస్తే ఆరు గ్యారెంటీలు

సుల్తానాబాద్‌రూరల్: ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు చేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరమణారావు అన్నారు. దేవునిపల్లి శ్రీలక్ష్మీనరసింహ ఆలయంలో ప్రతిజ్ఞ చేశారు. బాండ్ పేపర్‌పై సంతకం చేసి గ్రామస్తులకు చూపించారు. నాయకులు సాగర్ రావు, రాజాగౌడ్, శ్రీనివాస్, కట్ల కుమార్, వేణు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే..



మాట్లాడుతున్న సర్దార్ రవీందర్ సింగ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఒక్కటేనని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు బాలాజీరావు, పురం ప్రేమ్‌చందర్‌రావు, ముత్యం సునీత, పారుపల్లి గుణపతి, బుర్ర మౌనిక, ఐల రమేశ్, అంజయ్య గౌడ్, శీలం శంకర్, పల్లా సురేశ్, దయాకర్, సూర శ్యాం, గొట్టం మహేశ్, పురం రమణ, శ్రీనివాస్, ప్రభాకర్, సర్వేశ్, అంబదాస్, మమత, జ్ఞానేశ్వరి, గోపి, లక్ష్మి, అరుణ, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్‌తోనే న్యాయం

జూలపల్లి(పెద్దపల్లి): బీఆర్‌ఎస్ విజయంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని రఘువీర్‌సింగ్ అన్నారు. పెద్దాపూర్, కుమ్మరికుంటలో ఎమ్మెల్యే దాసరికి మద్దతుగా ప్రచారం చేశారు. నాయకులు తొగరు శ్రీనివాస్, గంగయ్య, సర్పంచ్ సంతోష్‌రావు, మల్లేశ్ యాదవ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

- రామగుండం బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్

గోదావరిఖని: అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి దేశానికే దిక్సూచిగా నిలిచిన కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించి రుణం తీర్చుకోవాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. సోమవారం 30వ డివిజన్‌లో ప్రజాఅంకిత యాత్ర నిర్వహించారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడూ ప్రజల ముఖంలో సంతోషం లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలిచి, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కాగా, మార్కెట్ కమిటీ గుమస్తాలు బీఆర్‌ఎస్‌లో చేరగా చందర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. కాగా,



కోలాటాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

42వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో చందర్ మాట్లాడుతూ, తనను ఎ మ్మెల్యే గెలిపిస్తే ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు, నగర మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్, నాయకులు కౌశిక హరి, ఐలయ్యయాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలి

కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేయాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నాయకులు బి.వెంకట్రావు, కెంగర్ల మల్లయ్య, నాయకులు కొమురయ్య, జహీద్‌పాషా ఉన్నారు.

సమ్మక్క గద్దెల వద్ద మినీ ట్యాంక్ బండ్

గోదావరినది తీరంలోని సమ్మక్క గద్దెల వద్ద మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

తుది అంకానికి ఎన్నికల ప్రచారం

- ఆరంభమైన ప్రలోభాలు
- బిజీ షెడ్యూల్‌లో అభ్యర్థులు
- ఓటరు జాబితా, పోలింగ్‌పై దృష్టి
- బూత్‌ల వారీగా ఇన్‌చార్జిల నియామకం

గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుకుంది. మంగళవారం చివరి రోజు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నియోజకవర్గంలో భారీ ర్యాలీలు నిర్వహించి తమ సత్తా చాటుకునేందుకు సిద్ధమైయ్యారు. ఈక్రమంలో ఆయా నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు బస్తీ మీటింగ్‌లు, పాదయాత్రలు, గనుల పర్యటనలు, వీధుల్లో ప్రచారాలు నిర్వహించిన అభ్యర్థులు భారీ ర్యాలీలు చేపట్టి బహిరంగ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టనున్నారు. ఎన్నికలకు మరో 48గంటలు ఉండటంతో గెలుపుపై తమ కసరత్తు ప్రారంభించారు.



ఏయే ప్రాంతాల్లో ఆయా సామాజిక వర్గాలు, ప్రాంతాలు, పలు వర్గాల వారీగా ఓటరు లిస్టుల ద్వారా లెక్కల్లో మునిగిపోయాయి.

ప్రలోభాలపై అభ్యర్థుల నజర్..

మరో 48గంటల్లో పోలింగ్ జరుగనుంది. దీంత అభ్యర్థులు సామ, వేద, దండోపాయాలపై దృష్టి సారించారు. ఇప్పటివరకు ప్రచారానికే పరిమితమైన అభ్యర్థులు.. ఇకనుంచి తమ వద్ద ఉన్న అస్త్రశస్త్రాలు సిద్ధం చేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి తాయిలాలు వైపు దృష్టి సారించారు. ఇప్పటికే ఓటుకు నోటుపై ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థులు ఈవిషయంపై స్పష్టమైన వైఖరితో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా రెండు పార్టీ మధ్యే ప్రధానంగా పోటీ ఉండగా అభ్యర్థులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు సాగుతున్నట్లుగా తెలుస్తోంది.

ఎన్నికల సంఘం దృష్టి..

ప్రచారం పర్వం తుది అంకానికి చేరుకోవడంతో చివరి 24గంటలపై ఎన్నికల సంఘంగా ప్రధానంగా దృష్టి సారించింది. ఇప్పటివరకు ప్రచారాలు, బహిరంగ సభలు, వాహనాల వినియోగం తదితర లెక్కల్లో మునిగి తేలిన అధికారులు.. ఇక ధ నప్రవాహం లేకుండా వ్యూహాత్మకంగా సాగుతున్నట్లుగా తెలుస్తోంది.

తుది శ్వాస వరకూ ప్రజల కోసం పోరు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: తన తుదిశ్వాస వరకూ ప్రజల కోసం పోరాటం చేస్తానని రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అభయం ఇచ్చారు. స్థానిక దుర్గానగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగిన బూత్‌స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బెదిరింపులకు భయపడవద్దని, అండగా ఉంటానన్నారు. చేతిగుర్తుకు ఓటువేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12వేలు

ఆటోడ్రైవర్లకు ఏటా రూ.12వేల సాయం చేస్తానని రాజ్‌ఠాకూర్ అన్నారు. విఠల్‌నగర్ నుంచి మెయిన్ చౌరస్తా వరకు సాగిన ఆటో ర్యాలీ సందర్భంగా ఆయన దుర్గానగర్‌లో ఆటో డ్రైవర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాగా, బీర్ఎస్ నాయకుదు కారం వినయ్ తదదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజ్‌ఠాకూర్ పార్టీలోకి ఆహ్వానించారు.



పార్టీలోకి ఆహ్వానించిన మక్కాన్‌సింగ్ ఠాకూర్

రామగుండం: ముర్మూర్‌కు పురోహితులు గాలెంకి ప్రసాద్, మాణిక్యం కుమార్, జాడి రాజేశ్‌కుమార్ తదితరులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మక్కాన్‌సింగ్‌ఠాకూర్ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముగిసిన మద్యం దుకాణాల గడువు

- నేటి సాయంత్రం నుంచి పోలింగ్ దాక మూసివేత
- డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం దుకాణాలు

జిల్లాలో మండలాలు	14
మద్యం దుకాణాలు	77



పెద్దపల్లిరూరల్: మద్యం దుకాణాలను టెండర్ల ద్వా రా దక్కించుకున్న కొత్త లైసెన్సుదారులు డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం దుకాణాలను ప్రారంభించను న్నారు. జిల్లాలోని 14 మండలాల పరిధిలో 77 మద్యం దుకాణాలున్నా యి. వీటి లైసెన్సు గడు వు నవంబర్ 30తో ముగియనుంది. డిసెంబర్ 1 నుంచి మొదలవ్వాల్సిన కొత్త దుకాణాల కోసం ఈ ఏడాది ఆగస్టు 4 నుంచి టెండర్లను స్వీకరించిన అధికారులు ఆగస్టు 21న లక్కీడ్రా పద్ధతిన ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

ఎన్నికల గిరాకీ దక్కలే..

కొత్తగా లైసెన్సు పొంది మద్యం వ్యాపారం చేసేందుకు ముందుకొచ్చిన వ్యాపారులకు అసెంబ్లీ ఎన్నికల గిరాకీ దక్కకుండా పోయింది. ఈనెల 30న అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా.. ఆరోజు వరకు పాత లైసన్సుదారులకే అమ్మకాలు చేసుకునేందుకు అవకాశముంది. కొత్త లైసన్సులపై డిసెంబర్ 1 నుంచి మద్యం అమ్మకాలు జరగనుండడంతో అసెంబ్లీ ఎన్నికల గిరాకీ చేసుకునే అవకాశం దక్కకుండా పోయింది.

గంటలే గడువు..!

మద్యం వ్యాపారం చేస్తున్న వ్యాపారుల గడువు నవంబర్ 30 ఆఖరు. అదే రోజున అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఇదివరకు పోలింగ్‌కు ఒకరోజు ముందు మద్యం దుకాణాలను మూసి ఉంచేలా ఆదేశాలిచ్చిన అధికారులు మరో అడుగు ముందుకేసి.. మైకుల మోత ఆగినప్పటి నుంచి మద్యం అమ్మకాలను కూడా ఆపేయాలనే ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మద్యం అమ్మకాలు మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ నెల 30 సాయంత్రం 5 గంటల దాకా నిలిచిపోనున్నాయి. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత మరో ఐదు గంటలు మద్యం విక్రయాలు చేసుకునేందుకు అవకాశముంది.

అనుమానమొచ్చింది..

మద్యం దుకాణాల్లో స్టాకు కొందరే ఎక్కువగా తెప్పిస్తుండడం, ఇంకొందరు చాలా తక్కువగా తెప్పిస్తుండడంతో అనుమానపడ్డ ఎన్నికల అధికారులు ఓటర్లను ప్రలోభపెట్టే నేతలకు సరఫరా చేస్తున్నారా అనే కోణంలో ఆరా తీశారు. ఎన్నికల అధికారి స్వయంగా రామగుండం ప్రాంతంలోని ఓ మద్యం దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ కూడా చేశారు. అయితే ఇప్పటికే వ్యాపారం చేస్తున్న వారికే మళ్లీ అదే దుకాణం దక్కడంతో స్టాకు ఎక్కువ మొత్తంలో తెప్పించుకుంటున్నారని తేలింది. లక్కీడిప్‌లో దుకాణం దక్కనివారు రోజు వారీ అమ్మకాలకు అనుగుణంగా స్టాకు తగ్గించుకుంటూ వస్తున్నారు. లేదంటే గడువు ముగిసిన తర్వాత ఆ స్టాకును తిరిగి డిపోలో డిపాజిట్ చేసి అందుకు తగ్గ సొమ్మును పొందాల్సి ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

మీకు ఓటర్ స్లిప్ అందలేదా..!

- యాప్ నుంచి పొందొచ్చు

జ్యోతినగర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ఓటర్లకు స్లిప్పుల పంపిణీ ముమ్మరంగా జరుగుతోంది. సగానికి పైగా ఓటర్లకు స్లిప్పులను అందించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ రెండు రోజుల క్రితం మీడియాకు వెల్లడించారు. ప్రతి ఇంటికి వెళ్లి నేరుగా ఓటర్ స్లిప్పులను అందించడానికి బూత్ లెవల్ అధికారు(బీఎల్‌వో)లకు బాధ్యతలు అప్పజెప్పినట్లు తెలిపారు. చాలామంది ఓటర్లు స్లిప్పులు అందలేదనే ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓటరు స్లిప్‌లను పొందేవిధంగా ఎన్నికల సంఘం చేపట్టిన వివరాలు ఇలా ఉన్నాయి. స్లిప్పులు ఎన్నికల సిబ్బంది నుంచి రాకపోతే ఆన్‌లైన్, మొబైల్ యాప్, హెల్ప్ లైన్ నెంబర్, మొబైల్ ఎస్‌ఎంఎస్ ద్వారా పొందడానికి ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. ఒకవేళ ఫిజికల్, డిజిటల్ ఓటర్ స్లిప్ లేకపోయినా నేరుగా పోలింగ్ బూత్‌కు వెళ్లి చెక్ చేసుకోవచ్చు. అదే పోలింగ్ కేంద్రంలో పేరున్నట్లయితే గుర్తింపు కార్డును చూపి ఓటేయొచ్చు. ఓటర్ స్లిప్, వివరాలను పొందే వెసులుబాటుంది.

ఒక్క సమాచారంతో..

ఓటరు గుర్తింపు కార్డు నెంబర్‌ను టైప్ చేసి 1950 లేదా 9211728082 అనే నెంబర్‌కు ఎస్‌ఎంఎస్ పంపితే ఓటరుకు సంబంధించిన వివరాలు లభిస్తాయి. ఆన్‌లైన్‌లో www.ceotelangana.nic.in అనే వెబ్‌సైట్‌లో సెర్చ్ యువర్ నేమ్–అసెంబ్లీ–ఓటర్స్ సర్వీస్ పోర్టల్ మెనూ ద్వారా ఓటరు గుర్తింపు కార్డు లేదా మొబైల్ నెంబర్ లేదా పేరును ఇవ్వడం ద్వారా ఏ నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటెయ్యాచ్చో తెలుసుకోవడంతో పాటు డిజిటల్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. www.electoralsearch.eci.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఇవే వివరాలను పొందుపర్చి ఓటర్ డిజిటల్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇలా కూడా పొందొచ్చు

www.voters.eci.gov.in అనే వెబ్‌సైట్‌లో సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్ అనే ఆప్షన్‌ను సెలెక్టు చేసి వ్యక్తుల వివరాలను పొందుపర్చడం ద్వారా కూడా తెలుసుకోవచ్చు. www.ceotelangana.nic.in అనే వెబ్‌సైట్‌లో అధికారుల వివరాలతో పాటు బూత్ లెవల్ అధికారుల వివరాలను ఆప్షన్ ద్వారా జిల్లా, నియోజకవర్గం, పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోల ఫోన్ నెంబర్లను తెలుసుకొని వారికి ఫోన్ చేసి బూత్ నెంబర్ వివరాలను తెలుసుకోవచ్చు. www.ceotserms2.telangana.gov.in./TSERODETAIL/BLO&Details.aspx అనే వెబ్‌సైట్ ద్వారా జిల్లా, నియోజకవర్గం వివరాలను పొందుపర్చి బీఎల్‌వోల ఫోన్ నెంబర్లను తెలుసుకోవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 24 గంటలూ పని చేసే హెల్ప్ లైన్(టోల్–ఫ్రీ) నెంబర్ 1950కి ఫోన్ చేసి ఓటర్ల వివరాలను లేదా ఓటరు గుర్తింపు కార్డు నెంబర్‌ను తెలియజేయడం ద్వారా కూడా పోలింగ్ కేంద్రం, బూత్, నెంబర్ తదితరాలను పొందొచ్చు. ఎన్నికల సంఘానికి మెయిల్ ఛొరుు ఇ్చజీ౩టఆఛిజీ.జౌ్ఠ.జీ ఽ ద్వారా కూడా గ్రీవెన్స్(ఫిర్యాదు)ను ఇచ్చి పోలింగ్ బూత్ వివరాలను తిరిగి మెయిల్ ద్వారానే పొందొచ్చు. ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐవోఎస్ వినియోగదారులు యాప్ స్టోర్ నుంచి ఓటర్ హెల్ప్ లైన్ యాప్ అనే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను ఇవ్వడం ద్వారా ఏ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఓటెయ్యాచ్చో తెలుసుకోవచ్చు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

ధర్మారం: మండల కేంద్రంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణను సోమవారం అంబేద్కర్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. లక్ష్మీనారాయణ ధర్మారం రాగా.. ఫంక్షన్ హాల్‌లో సత్కరించారు. దళిత సంఘాల నాయ కులు రామగిరి మల్లేశం, సుంచు మల్లేశం, పెరుక భానేష్, కుశనపల్లి రవి, చొప్పదండి మల్లేశం, రామిల్ల బాపు, జేరి పోతుల నర్సయ్య, గాజుల లచ్చయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ చైర్మన్‌పై కేసు

ముత్తారం: మైదంబండ పంచాయతీ కార్యాలయం ముందు ఈనెల 15న బీఆర్‌ఎస్ చేరికలు చేస్తూ పార్టీ కండువాలు కప్పిన ముత్తారం సింగిల్‌విండో చైర్మన్, జిల్లా కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గుజ్జుల రాజిరెడ్డిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మంథని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమానాయక్ ముత్తారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రావు సోమవారం తెలిపారు.